# విజయీభవ

- నేడు విజయదశమి
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు
- ఆలయాలు ముస్తాబు
- రామ్‌లీలాకు సర్వం సిద్ధం



భీంపూర్‌లో కొలువుదీరిన దుర్గాదేవీ

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 22 : దసరా.. హిందువుల ముఖ్యమైన పండుగ. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు 9 రోజులు దేవీ నవరాత్రులు. పదో రోజు విజయదశమి కలిసి దసరా అంటారు. ఇది ముఖ్యంగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యత ఇచ్చే పండుగ. దీనిని నవరాత్రి, శరన్నవరాత్రి అని అంటారు. శరదృతువు ఆరంభంలో వచ్చే పండుగ కాబట్టి ఈ పేరు వచ్చింది. కొందరు ఈ పండుగను మొదటి మూడు రోజులు పార్వతీ దేవికి, తర్వాత లక్ష్మీదేవికి, తర్వాత మూడు రోజులు సరస్వతీ దేవికి పూజలు నిర్వహిస్తారు. అలాగే ఆలయాల్లో అమ్మవారిని ఒక్కో రోజు ఒక్కో అలంకారం చేస్తారు. తెలుగువారు దసరాను 10 రోజులు జరుపుకుంటారు. తెలంగాణలో 9 రోజులు అమావాస్య నుంచి నవమి వరకు బతుకమ్మ ఆడతారు. పలు చోట్ల రావణాసుర దహనం పేరిట 'రామ్‌లీల' నిర్వహిస్తుంటారు. ఈ యేడాది మంచిర్యాల జిల్లాలో 23వ తేదీ సోమవారం విజయదశమి నిర్వహించనున్నారు.

### చెడు మీద మంచి విజయం..

చెడుమీద మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగను విజయదశమి అని పిలుస్తారు. మనిషి తనలోని కామ, క్రోధ, మధ, మత్సర, మోహ, లోభ, స్వార్థ, అన్యాయ, అమానవత, అహంకారం అనే పది దుర్గుణాలను ఈ నవరాత్రుల్లో తొలగించుకునేందుకు ఆధ్యాత్మికంగా ఉత్తమమైన మార్గం. దీనిని 10 రోజుల పాటు జరుపుకుంటారు. ముందు నవరాత్రులు దుర్గపూజ ఉంటుంది. విజయదశమి రోజున చరిత్ర ప్రకారం రాముడు రావణుడిపై గెలిచిన సందర్భమే కాకుండా పాండవులు వనవాసం వెళ్తూ జమ్మిచెట్టుపై తమ ఆయుధాలను తిరిగి తీసుకున్న రోజుగా చెబుతుంటారు. ఈ సందర్భంగా రావణ వధ, జమ్మి ఆకుల పూజ చేయడం అనవాయితీగా వస్తున్నది. జగన్మాత అయిన దుర్గాదేవి, మహిషాసురుడనే రాక్షసుడితో 9 రాత్రులు యుద్ధం చేసి అతన్ని వధించి జయాన్ని పొందిన సందర్భంగా పదో రోజు ప్రజలంతా సంతోషంగా పండుగ జరుపుకున్నారు. అదే విజయదశమిగా పేర్కొంటారు.

### మహిషాసురుని వధ..

బ్రహ్మదేవుడి వరాలతో వర గర్వితుడైన మహిషాసురుడు దేవతలతో ఘోరమైన యుద్ధం చేసి వారిని ఓడించి ఇంద్ర పదవిని చేపట్టాడు. దేవేంద్రుడు త్రిమూర్తులతో మొరపెట్టుకోగా మహిషునిపై వారిలో రగిలిన క్రోధాగ్ని ప్రకాశవంతమైన తేజంగా మారింది. త్రిమూర్తుల తేజం కేంద్రీకృతమై ఒక స్త్రీరూపమై జన్మించింది. శివుని తేజం ముఖంగా, విష్ణు తేజం బాహువులుగా, బ్రహ్మ తేజం పాదాలుగా కలిగి మంగళమూర్తిగా అవతరించిన ఆమె 18 చేతులను కలిగి ఉంది. ఆమెకు శివుడు శూలాన్ని, విష్ణువు చక్రాన్ని, ఇంద్రుడు వజ్రాయుధాన్ని, వరుణ దేవుడు పాశం, బ్రహ్మదేవుడు అక్షమాల, కమండలం హిమవంతుడు సింహాన్ని వాహనంగాను ఇచ్చారు. ఇలా సర్వదేవతల ఆయుధాలు సమకూర్చుకొని మహిషాసురుని సైన్యంతో తలపడి భీకరమైన యుద్ధాన్ని చేసింది. మహిషాసురుని తరపున యుద్ధానికి వచ్చిన ఉదగ్రుడు, మహాహనుడు, అసిలోముడు, బాష్కలుడు, బిడాలుడు మొదలైన వారిని సంహరించిన తర్వాత మహిషాసురునితో తలపడింది. ఈ యుద్ధంలో ఆ దేవి వాహనమైన సింహం శత్రువులను చీల్చి చెండాడింది. దేవితో తలపడిన అసురుడు మహిషాసురు రూపం, సింహరూపం, మానవ రూపంతో భీకరంగా పోరు, చివరకు మహిషి రూపంలో దేవి చేతిలో హతుడయ్యాడు. అప్పటి నుంచి మహిషుని సంహరించిన రోజు దసరా పర్వదినంగా పిలుస్తారు. అదే విజయదశమి రోజునే శమీ పూజ కూడా నిర్వహిస్తారు. శ్రీరాముని వనవాస సమయంలో కుటీరం జమ్మి చెట్టు చెక్కతోనే నిర్మించారని చెబుతారు. శమీ అంటే పాపాల్ని, శత్రువులను నశింపజేసేది. పంచ పాండవులు అజ్ఞాత వాసానికి వెళ్లే ముందు తమ ఆయుధాలను శమీ చెట్టుపై పెట్టారు. సామాన్యులే కాకుండా యోగులు నవరాత్రులలో అమ్మవారిని పూజిస్తారు. ఆలయాల్లో అమ్మవారికి విశేష అలంకరణలు చేసి పూజిస్తారు.

### నేడే దసరా పండుగ జరుపుకోవాలి..



దసరా పండుగ ఈనెల 23వ తేదీనే జరుపుకోవాలి. 23 లేదా 24తేదీల్లో ఏరోజు జరుపుకోవాలనే సంశయాన్ని పండిత సభా నివృత్తి చేసింది. భక్తుల అయోమయాన్ని తొలగించింది. సోమవారం మధ్యాహ్నం నుంచి దశమి తథి ఉండడం, శ్రవణా నక్షత్రం సోమవారం రోజే ఉండడంతో 23వ తేదీనే పండుగను జరుపుకోవాలి. సాయంత్రం శమీ (జమ్మిచెట్టు) దర్శనం చేసుకోవాలి. అమ్మవారిని పూజించడంతో సకలపాపాలు తొలగిపోతాయి. విజయాలు కలుగుతాయి.

**- వేమారపు మహేశ్వర్ శర్మ, పూజారి, శివాలయం, చెన్నూర్**

# కిడ్నీ బాధితులకు వరం
# డయాలసిస్ సెంటర్



రోగులను పరిశీలిస్తున్న సిబ్బంది



ఉట్నూర్ డయాలసిస్ కేంద్రం

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రోగులకు వైద్యసేవలు

ఉట్నూర్, అక్టోబర్ 22: మానవ శరీరంలో కిడ్నీల పాత్ర కీలకం. చెడు రక్తాన్ని శుద్ధి చేసి ప్రతి అవయవానికి పంపడం విధి. దీనికి చికిత్స అనేది అతి ఖరీదైనది. కచ్చితంగా డయాలసిస్ చేసుకోవాలి. లేకపోతే ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్టే. ఇటువంటి పరిస్థితులను గుర్తించిన సర్కారు ఏజెన్సీలోని కిడ్నీ రోగులకు 2018 సంవత్సరంలో ఉట్నూర్‌లోని దవాఖానలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన 39 మంది రోగులు ఉట్నూర్ దవాఖానలో డయాలసిస్ చేయించుకుంటున్నారు. వీరు గతంతో కరీంనగర్, హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లో రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు ఖర్చు పెట్టుకుంటు రక్తాన్ని శుద్ధి చేయించుకునే వారు. ప్రభుత్వం ఉట్నూర్ వంటి చిన్న పట్టణాల్లో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో ఉట్నూర్, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, కడెం, ఖానాపూర్, కెరమెరి, జైనూర్, నార్నూర్ ప్రాంతాల రోగులకు వైద్యం అందుతోంది. ప్రభుత్వ ఖర్చుతో 39 మందికి వారంలో మూడు సార్లు రక్తం శుద్ధి చేస్తున్నారు. కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న రోగులకు సర్కారు బస్సు ప్రయాణం ఉచితంగా కల్పిస్తోంది.

### కిడ్నీ సమస్యతో బాధపడుతున్న..



కిడ్నీ చెడిపోయి చాలా ఇబ్బందులు పడ్డా. సుమారు నాలుగేండ్లుగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రక్తశుద్ధి చేయించుకున్న. ఉట్నూర్ ప్రభుత్వ దవాఖానలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడంతో అప్పటి నుంచి ఇక్కడనే రక్తం శుద్ధి చేయించుకుంటున్న. ఆదిలాబాద్‌కు పోయి రావాలంటే డబ్బులు బాగా అయ్యేవి. నా వెంట ఒకరిని తీసుకుపోవాల్సి వచ్చేది. గిప్పుడు పైసలు, మనుషుల బాధ తప్పింది.

**-సావిత్రిబాయి, ఉట్నూర్**

### మాది గోస వర్ణణాతీతం.



– కిడ్నీలు పాడైనొళ్ల గోస మామూలుగా ఉండది. రక్తం మొత్తం మిషన్లకు పోయి శుద్ధి అయి మళ్ల శరీరానికి వస్తది. ఇట్లా వారంలో మూడు సార్ల చేయించుకోవాలె. మేము ఉన్న లేకున్నట్లుగా ఉంటది. మా గోస ప్రభుత్వం పట్టించుకుంది. అందుకే మాకు దగ్గర డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసింది. లేకుంటే సిటీకి పోయి ఖర్చు పెట్టుకొనే స్థోమత మాకు లేదు.

**- రోషన్, ఇంద్రవెల్లి**

## బీఆర్ఎస్‌లో చేరికల జోరు



బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ 'సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న బీజేపీ నాయకులు

ఇచ్చోడ, అక్టోబర్ 22 : మండలంలోని పలువురు బీజేపీ నాయకులు ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ గులాబీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సాపూర్ యువకులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## పీచరలో బోనాల జాతర

లక్ష్మణచాంద, అక్టోబర్ 22 : నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం పీచర గ్రామంలో దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం బోనాల జాతర నిర్వహించారు. శ్రీరాముల వారి ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం నుంచి మహిళలు బోనాలు ఎత్తుకొని ప్రధానవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. అనంతరం దుర్గమాతకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బుర్రి లత, ఎంపీటీసీ తిప్పని రాజేశ్వర్, గ్రామ వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.



పీచరలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

## గోశాల సందర్శన



గోశాలను సందర్శిస్తున్న నిర్మల్ జిల్లా కోర్టు మేజిస్ట్రేట్ అజయ్

ఇచ్చోడ, అక్టోబర్ 22 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ సమీపంలోని జై శ్రీరాం జై గోమాత గోశాలను ఆదివారం నిర్మల్ జిల్లా కోర్టు మేజిస్ట్రేట్ అజయ్ సందర్శించారు. గోవులను పరిశీలించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోశాలలను సందర్శించడం సంతోషకరమన్నారు. గోశాల వ్యవస్థాపకుడు రాజేశ్‌ను అభినందించారు. గోశాలలో ఉన్నటువంటి సమస్యలను మేజిస్ట్రేట్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకులంగా స్పందించారని రాజేశ్ తెలిపారు.

## కొనసాగుతున్న శరన్నవరాత్రోత్సవాలు

లోకేశ్వరం, అక్టోబర్ 22 : మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో దుర్గా శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆది వారం అబ్దుల్లాపూర్ గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గామాత మహిసాసురమర్ధిని అవతారంలో దర్శనమిచ్చింది. వేద పండితులు హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.